మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే నలమాద పద్మావతి
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు ప్రారంభం

కోదాడటౌన్, డిసెంబర్ 10 : మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి కోరారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం ఆమె మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం ఉందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలనుకునే మహిళలు తమ వెంట ఏదైనా గుర్తింపు కార్డులు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం కోదాడలోని ప్రభుత్వ వైద్యశాలలో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం రూ.10లక్షలకు పెంపు పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీహర్ష, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, లంకెల నిరంజన్‌రెడ్డి, జడ్పీటీసీ మండలపు కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మల్లెల రాణి, మేకపోతుల సత్యనారాయణ, బుర్రా సుధారాణీపుల్లారెడ్డి, ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీపీ

హుజూర్‌నగర్ : ప్రభుత్వం మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి కోరారు. పట్టణంలో ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆదివారం ఆమె మఠంపల్లి ఎంపీపీ పార్వతితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సులైన పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లో మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కౌన్సిలర్లు సంపత్‌రెడ్డి, గాయత్రీభాస్కర్ పాల్గొన్నారు.

కోదాడ టౌన్ : మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

ఎన్నికల్లో ఓడినా ప్రజలతోనే నా ప్రయాణం

- మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, డిసెంబర్ 10 : ఎన్నికల్లో ఓడినా నియోజకవర్గ ప్రజలతోనే తన ప్రయాణం కొనసాగిస్తానని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. నాలుగేండ్లలో రూ.4వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. పార్టీ గెలుపు కోసం కష్టపడిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించే నియోజకవర్గ స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శివాలయంలో కార్తీక పూజలు

మేళ్లచెర్వు, డిసెంబర్ 10 : కార్తీక మాసం చివరి ఆదివారం పురస్కరించుకొని మండల కేంద్రంలోని స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఆకాశదీప ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. స్థానిక సంత సోమేశ్వర, వేంకటేశ్వర, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో హోమాలు, ఆకాశదీప పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, యాతవాకిళ్ల భానుకిరణ్‌శర్మ, సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణమాచార్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శివుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ

గరుడ వాహనంపై స్వామి వారి ఊరేగింపు

కిట్స్ విద్యార్థులకు బంగారు పతకాలు

కోదాడ టౌన్, డిసెంబర్ 10 : పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. ఏపీ రాష్ట్రంలోని నందిగామలో ఆదివారం నిర్వహించిన 4వ జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థినులు పాల్గొని విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఆయనతో పాటు కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

సిరిపురంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నడిగూడెం, డిసెంబర్ 10 : మండలంలోని సిరిపురంలో ముందస్తుగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సురేశ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవళికి శాంతి, కరుణ ప్రేమను నెలకొల్పేందుకు ఈ లోకానికి వచ్చారన్నారు. కార్యక్రమంలో రాజకుమార్, నగేశ్, అబ్రహం పాల్గొన్నారు.

రాజాపేటలో హోరాహోరీగా రాష్ట్రస్థాయి పోటీలు

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రాజాపేట, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం రెండోరోజు 9వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, ఫుట్ బాల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, క్యారమ్ పోటీలు నిర్వహించారు. సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ స్పోర్ట్స్ మీట్ సెక్రటరీ రామ్‌లక్ష్మణ్ క్రీడలను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావాలు పెంపొందుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే క్రీడల్లో రాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహాచారి, పీడీ వెంకటేశ్వర్లు, పీఈటీ నరేశ్, 8జోన్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ భరోసా

- హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్, డిసెంబర్ 10 : పేదల ఆరోగ్యానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ భరోసాగా నిలవబోతుందని హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. పేదలకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంతో రూ.10లక్షల వైద్య సాయం అందనుందని పేర్కొన్నారు. ఏరియా ఆస్పత్రిలో ఈ పథకంతో మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి, ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, పార్వతీకొండానాయక్, జడ్పీటీసీ కొండా నాయక్, కౌన్సిలర్ గాయత్రీభాస్కర్, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, దొంతగాని శ్రీనివాస్, సాముల శివారెడ్డి, సైదా, సూపరింటెండెంట్ కరణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో రాజీవ్ ఆరోగ్య శ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పిషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబిసిట్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	తొలుపునూరి : 9182777638

విశిష్ట సాహితీ అవార్డు అందుకుంటున్న శ్రీపాద అర్చనాదేవి

అర్చనాదేవికి సేవారత్న పురస్కారం

హుజూర్‌నగర్, డిసెంబర్ 10 : తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ యువ రచయిత్రి శ్రీపాద అర్చనాదేవికి తెలుగు వెలుగు విశిష్ట సాహితీ సేవారత్న జాతీయ గౌరవ పురస్కారాన్ని విజయవాడలో ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అర్చనాదేవి మాట్లాడుతూ సామాజిక అంశాలతో కవితలు, సంకలనాలు, సూక్ష్మ కథల రచనలు చేసినందుకుగాను తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు అవార్డు అందించినట్లు తెలిపారు.

మట్టపల్లిలో శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

మఠంపల్లి, డిసెంబర్ 10 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనర్సింహ స్వామి క్షేత్రంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఆలయ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

- భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

గరిడేపల్లి, డిసెంబర్ 10 : ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆదివారం ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణాకు అవకాశం కల్పించాలన్నారు. అదేవిధంగా త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలన్నారు. అదేవిధంగా పింఛన్‌ను రూ.6 వేలు అందించాలని, విడుతల వారీగా బ్యాక్‌లాగ్ పోస్టులు గుర్తించి భర్తీ చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర గోపియాదవ్, యూత్ అధ్యక్షుడు గుర్రం నరేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు ఈదయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్ అందించాలి : పీవైఎల్

గరిడేపల్లి, డిసెంబర్ 10 : లింగ భేదం లేకుండా విద్యార్థులందరికీ ప్రభుత్వం ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి కోరారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మండలంలోని వెలిదండ గ్రామంలో ఆదివారం బైక్ ర్యాలీ తీశ బూరు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలను నిర్లక్ష్యం చేసినా ఏ ప్రభుత్వమైనా కనుమరుగు అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు కట్టుబడి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్య, పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి కామళ్ల సుందరయ్య, నాయకులు కారింగుల నాగరాజు, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కామళ్ల బాలు, ఉదయ్, డివిజన్ సహాయ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.